నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శనివారం 18 మే 2024 | HYDERABAD




వెస్ట్‌జోన్ జడ్సీ స్నేహ శబరీష్‌తో కలిసి వాటర్ లాగింగ్ పాయింట్లను పరిశీలిస్తున్న బల్దియా కమిషనర్ రోనాల్డ్ రాస్



## రహదారులపై నీరు ఆగొద్దు

### బల్దియా కమిషనర్ రోనాల్డ్ రాస్

సిటీబ్యూరో, శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ పర్యటించారు. గచ్చిబౌలి బయోడైవర్సిటీ జంక్షన్, మాదాపూర్ ప్రధాన రహదారి తదితర ప్రాంతాల్లోని వాటర్ లాగింగ్ పాయింట్లను ఆయన వెస్ట్ జోన్ కమిషనర్ స్నేహశబరీష్‌తో కలిసి పరిశీలించారు. ఐటీ కారిడార్ ప్రాంతంలో వర్షానికి రహదారులపై నీరు నిలిచి.. తీవ్ర ట్రాఫిక్ జామ్‌కు కారణమవుతున్నదని, వాహనదారులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కాగా, హైదరాబాద్ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించి పనులను చేపట్టాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. రాబోయే 6 నెలలకు తగ్గట్టుగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో ఆయన సమీక్షించారు.

### ప్రమాదాలు వాటిల్లకుండా..

వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు 166 మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్‌ను రంగంలోకి దింపనున్నారు. ఇందులో 64 మొబైల్, 104 మినీ మొబైల్ బృందాలు ఉండగా, 160 స్టాటిక్ లేబర్స్ టీమ్స్ ఉంటాయి. మొబైల్, మినీ మొబైల్ ఎమర్జెన్సీ టీంలలో షిఫ్టు వారీగా ప్రతి బృందంలో నలుగురు కార్మికులు ఉంటారు. దీంతో పాటు ప్రతి చెరువుకు ఒక ఇన్‌చార్జితో పాటు ఇద్దరిని కేర్ టేకర్ (పర్యవేక్షకులు)గా నియమించనున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద అంచనా బట్టి దిగువకు చెరువు నీటిని విడుదల చేయడం, ఎప్పటికప్పుడు చెరువుల వరదపై అప్రమత్తంగా ఉండటం వంటి చర్యలు చేపడతారు. ఎన్ఎన్‌డీపీ పనులు జరిగే స్థలాల్లో ఎలాంటి ప్రమాదాలు వాటిల్లకుండా బ్యారికేడ్ల ఏర్పాట్లు, రోడ్లు మూసివేత, హెచ్చరిక బోర్డులు ఏర్పాట్లపై దృష్టి సారిస్తారు. ప్రాజెక్టు విభాగానికి సంబంధించి 18 మంది అధికారులను నియమించనున్నారు.



# వర్షాకాలం.. ఆగం కాకుండా..

## 36.98 కోట్లతో మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్

### జూన్-అక్టోబర్ వరకు బల్దియా ప్రత్యేక కార్యాచరణ

### రంగంలోకి దిగనున్న 166 అత్యవసర బృందాలు

సిటీబ్యూరో, మే 17, (నమస్తే తెలంగాణ) : రాబోయే వర్షాకాల సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జీహెచ్ఎంసీ సన్నద్ధమైంది. ఈ మేరకు జూన్ నుంచి అక్టోబర్ వరకు మాన్‌సూన్ యాక్షన్‌ప్లాన్ రూపకల్పనకు సిద్ధమైంది.స్టాటిక్ లేబర్ టీంలు, మినీ మొబైల్ టీమ్‌లు, వాహనాలు, మొబైల్ ఎమర్జెన్సీ బృందాల ఏర్పాటులో భాగంగా సర్కిళ్ల వారీగా టెండర్లను ఆహ్వానించి.. సమగ్ర కార్యాచరణ ప్రణాళికకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏటా తరహా ఈ ఏడాది కూడా రూ. 36.98 కోట్లతో ప్రత్యేక బడ్జెట్‌తో బల్దియా మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ అమలు చేయనున్నది. అయితే, వర్షాకాలం వచ్చే ముందే నాలాల పూడిక తీత పనులను ఇప్పటికే తుది దశకు చేర్చాల్సిన అధికారులు.. ఆ దిశగా పనుల్లో వేగం పెంచలేదు.

### బల్దియాతో అమీతుమీ..

జీహెచ్ఎంసీతో అమీతుమీ తేల్చుకునేందుకు కాంట్రాక్టర్లు సిద్ధమయ్యారు. ఏడాది కాలంలో అప్పుల ఊబిలో చిక్కుకుని, ఆర్థిక సమస్యలతో ప్రాణాలు పోతున్నా.. జీహెచ్ఎంసీ లెక్క చేయడం లేదని, రూ. 1350 కోట్ల బకాయిలు చెల్లించే వరకు ప్రస్తుతం చేపడుతున్న పనులతో పాటు కొత్తగా చేపట్టబోయే పనులకు దూరంగా ఉంటామంటూ అల్టిమేటం జారీ చేశారు. ఈ మేరకు నేటి నుంచి కాంట్రాక్టర్లంతా మూకుమ్మడిగా బంద్‌లోకి వెళ్తున్నట్లు జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం ప్రకటించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని కాంట్రాక్టర్లంతా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో శనివారం అత్యవసర సమావేశమై కార్యాచరణను ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు.

## మెట్రో వేళలు పొడిగింపు

### మరో 45 నిమిషాలు పెంపు

### ఇక నుంచి చివరి రైలు 11.45 గంటలకు..

### ప్రతి సోమవారం ఉదయం 5:30 గంటలకే..

సిటీబ్యూరో/మణికొండ: నగరవాసులకు గుడ్‌న్యూస్. మెట్రో రైలు వేళల్లో అధికారులు మార్పు చేశారు. ఇప్పటివరకు రాత్రి 11 గంటల వరకు చివరి రైలు ఉండగా.. ఇక నుంచి ఆ రైలు 11.45 గంటలకు బయలుదేరి.. గమ్యస్థానానికి 12.45 గంటలకు చేరుకుంటుంది. అలాగే ప్రతి సోమవారం ఉదయం 5.30 గంటలకే మెట్రో రాకపోకలు మొదలుకానున్నాయి. మిగతా రోజుల్లో సాధారణంగానే ఉదయం 6 నుంచే సర్వీసులు నడుస్తాయి. పొడిగించిన వేళలు శుక్రవారం రాత్రి నుంచి అమల్లోకి రానున్నాయి.

### ప్రతి రోజూ 4.5 లక్షల మంది ప్రయాణికులు

నార్సింగిలో తెలంగాణ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రీన్ అన్వల్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సమ్మిట్-2024 జరిగింది. ఈ కార్యక్రమానికి మెట్రో రైల్ ఎల్ అండ్ టీ చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ మురళీ వరద రాజన్ హాజరయ్యారు. 'ద మొబిలిటీ ఫర్ టుడే అండ్ టుమారో' అంశంపై ఆయన ప్రసంగించారు. ప్రతి రోజూ మెట్రో సేవలను 4.5 లక్షల మంది ప్రయాణికులు వినియోగించుకుంటున్నారని, సగటు ట్రిప్ పొడవు 12.5 కిలోమీటర్లు అని వివరించారు. నగరవాసుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల దృష్ట్యా మెట్రో సమయాన్ని మరో 45 నిమిషాల పాటు పొడిగించినట్లు వెల్లడించారు. కాగా, ఈ కార్యక్రమంలో ఎల్ అండ్ టీ మెట్రో సంస్థ 'ద బెస్ట్ గ్రీనింగ్ ద ఫ్యూచర్2023-24' అవార్డును దక్కించుకున్నది.

## బోడుప్పల్ మేయర్, డిప్యూటీ మేయర్లపై అవిశ్వాసం?

బోడుప్పల్, మే17: బోడుప్పల్ మేయర్, డిప్యూటీ మేయర్ పీఠాన్ని హస్తగతం చేసుకునేందుకు కాంగ్రెస్ నాయకులు చురుగ్గా పావులు కదుపుతున్నారు. బోడుప్పల్ కార్పొరేషన్‌లో 28 మంది కార్పొరేటర్లు ఉండగా, ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు 20 మంది అవిశ్వాసం ప్రకటిస్తూ సంతకాలు చేసిన పత్రాన్ని అందజేశారు. మరో ఇద్దరు కార్పొరేటర్లు కూడా పరోక్షంగా మద్దతు ఇస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

### వాన నీటిని తోడే క్రమంలో

## బాలుడికి కరెంట్ షాక్

### చికిత్స పొందుతూ మృతి



షాదుల్లా ఇమ్రాన్ (ఫైల్)

మూసాపేట, మే17: ఇంట్లోకొచ్చిన వరద నీటిని తోడే క్రమంలో ఓ బాలుడు కరెంట్ షాక్‌కు గురై.. చికిత్స పొందుతూ చనిపోయాడు. కూకట్‌పల్లి సీఐ కృష్ణ మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్ పరిధి ఇందిరానగర్‌కు చెందిన మహ్మద్ పాషా, నజీమబేగం దంపతులు గుడిసెలో నివాసముంటున్నారు. వీరికి ముగ్గురు సంతానం. గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి గుడిసెలోకి వరద నీరు చేరింది. దీంతో కుమారుడు షాదుల్లా ఇమ్రాన్(11) వరద నీటిని తోడేందుకు మోటర్ ఆన్ చేసే క్రమంలో విద్యుత్‌ఘాతానికి గురయ్యాడు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



## వెంకన్న సన్నిధిలో..

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ కుర్మయ్యగారి నవీన్‌కుమార్ శుక్రవారం తిరుమల శ్రీవారిని, కాణిపాకం వరసిద్ధి వినాయకుడిని దర్శించుకొని.. ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, నేతలు జిడిపల్లి రాజేశ్వర్‌రావు, నాయినేని తులసీరావు, రవిరాజు, మామిడాల రవీందర్‌రెడ్డి, మహేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

**- కేపీహెచ్‌బీ కాలనీ, మే 17**



## ఇంత నిర్లక్ష్యమా..?

లక్షల విలువైన ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఫర్నిచర్‌ను గాలికి వదిలేశారు. ఎండకు ఎండుతూ..వానకు తడుస్తున్నా.. పట్టించుకోవడం లేదు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా తరగతి గదుల్లో ఉన్న ఫర్నిచర్‌ను తీసి..పాఠశాలల మైదానంలో వేశారు. అయితే పోలింగ్ పూర్తయిన వెంటనే వాటిని తిరిగి తరగతి గదుల్లో పెట్టించాలన్న ఆలోచనను అధికారులు మర్చిపోయారు. దీంతో విలువైన ఫర్నిచర్ పాడయ్యే అవకాశమున్నది. బాలాపూర్ మండల పరిధిలోని అన్ని సర్కారు స్కూళ్లలో ఇదే పరిస్థితి నెలకొన్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 'మన ఊరు-మన బడి' కింద కోట్లు ఖర్చు చేసి.. ప్రతి ప్రభుత్వ పాఠశాలలకు కొత్త ఫర్నిచర్‌ను అందజేశారు. ఇవి నాలుగు కాలాల పాటు విద్యార్థులకు ఉపయోగపడేవి. ఇదిలా ఉంటే మున్సిపల్ అధికారులు మాత్రం ఎవరి ఫర్నిచర్ వారే చూసుకోవాల్సిందేనంటున్నారు. ఈ విషయమై విద్యాధికారులకు ఫోన్లు చేసినా.. స్పందించలేదు. కొందరు ఉపాధ్యాయులు స్పందించి మున్సిపల్ అధికారులు చూసుకుంటారని సమాధానాన్ని దాట వేశారు. మీర్‌పేట ప్రభుత్వ పాఠశాలలో ఆరుబయట పడేసిన ఫర్నిచర్‌ను చిత్రంలో చూడొచ్చు.

**-బడంగ్‌పేట, మే17**

# అన్నదాతల అవస్థలు

### ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం

### రైతులను కంగారుపెడుతున్న వానలు

### ధాన్యం తడిస్తుందని ఆవేదన

మేడ్చల్, మే 17(నమస్తే తెలంగాణ): ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మేడ్చల్ జిల్లావ్యాప్తంగా కొనాల్సిన ధాన్యం 20 వేల మెట్రిక్ టన్నులు కాగా ఇప్పటి వరకు 5 వేల 15 వేల మెట్రిక్ ధాన్యం మాత్రమే కొనుగోళ్లు జరిగాయి. జిల్లాలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు 12 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ధాన్యం కొనుగోళ్లలో అధికారులు ఆలస్యం చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వాతావరణ పరిస్థితులు మారి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ధాన్యం తడిసిన పరిస్థితులు వచ్చాయని ఆవేదన చెందుతున్నారు. అంతేకాకుండా కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు అన్నదాతలు పేర్కొంటున్నారు.

### 13,125 ఎకరాల్లో వరి సాగు

జిల్లాలో యాసంగిలో 13,125 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా, 20 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం వస్తుందని అంచనా వేశారు. అయితే, ఇప్పటి వరకు 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. గురువారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా జడ్పీ సర్వసభ్య సమావేశంలో ధాన్యం కొనుగోలు తీరుపై సభ్యులు నిలదీశారు. ధాన్యాన్ని తొందరగా కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులుపడుతున్నట్లు చెప్పారు. ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

### తడిసిన ధాన్యాన్ని కొనాలి..

ఇటీవల కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిసిపోయిందని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా.. ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

### అధికారుల నిర్లక్ష్యం వల్లే

**-డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లి.. ధాన్యం కొన్నాం. అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఇప్పుడు ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు వస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించి ధాన్యాన్ని కొనాలి.



## రేషన్ షాపుల ద్వారా భారత్ బ్రాండ్

అబిడ్స్, మే 17: కేంద్ర ప్రభుత్వం దేశంలోని రేషన్ దుకాణాల ద్వారా భారత్ బ్రాండ్ నిత్యావసర సరుకులను విక్రయించేలా.. చర్యలు తీసుకోనున్నట్లు ప్రాథమికంగా నిర్ణయించినట్లు ఆలిండియా ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్స్ ఫెడరేషన్ నేషన్ జనరల్ సెక్రటరీ బిశ్వంబర్ బసు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రేషన్ దుకాణాల అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం భారత్ బ్రాండ్ ద్వారా నిత్యావసర వస్తువులను చౌకగా ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చి వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల ద్వారా విక్రయాలు చేపట్టాలని నిర్ణయించిందన్నారు. అయితే సెంట్రల్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి బిశ్వంబర్ బసు ఆధ్వర్యంలో వీరి బృందం కేంద్ర ప్రభుత్వంతో చర్చించి రేషన్ దుకాణాల ద్వారా భారత్ బ్రాండ్ వస్తువులను విక్రయించేలా ఒప్పించడంలో సఫలీకృతులైనట్లు నగర నాయకులు నాయకోటి రాజు తెలిపారు.




మేడ్చల్ జిల్లా శామీర్‌పేట ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద లోడ్‌తో ఉన్న వరి ధాన్యం

## కర్మాన్‌ఘాట్‌లో.. ప్యాట్ కమిన్స్

చంపాపేట, మే17: సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ శుక్రవారం చంపాపేట డివిజన్ కర్మాన్‌ఘాట్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో సందడి చేశారు. విద్యార్థులతో కలిసి క్రికెట్ ఆడి వారిని ఉత్తేజపరిచారు. పాఠశాలలో నిర్వహించిన బూట్ క్యాంపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన.. విద్యార్థులు భవిష్యత్‌లో నిర్వహించాల్సిన ప్రాజెక్టులను ఎలా తయారు చేసుకోవాలో తెలిపారు. సైన్స్ పరికరాల వినియోగం, వాటి ప్రయోగ విధానం, శాస్త్రీయ దృక్పథంతో కొత్త పరికరాల తయారీ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో యూనిసెఫ్ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి శేషగిరి మధుసూదన్‌రావు, ఎస్పీడీ మల్లయ్య, జిల్లా విద్యాధికారి సుసేంద్రరావు, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

